క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



ధరూరు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావెంకటేశ్వరొరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మార్లబడులో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె ఎంపీపీ నజీమున్నీ బేగంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా టాస్ వేసి క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. క్రీడలతో సేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడు దేవన్నకు ఘన నివాళి

అలంపూర్: అయిజ మండలం పులికల్‌లో తెలంగాణ ఉద్యమకారుడు, ప్రజా సంఘాల నాయకుడు దేవన్న అంత్యక్రియలు శుక్రవారం కుటుంబ, బంధుమిత్రుల అశ్రునయాల మధ్య ముగిశాయి. రోడ్డు ప్రమాదంలో గాయపడిన దేవన్న కర్నూల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్, జిల్లా జెడ్పీచైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం, ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ బంగారి భాస్కర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, జిల్లా కో–ఆర్డీనేటర్ కుర్వపల్లయ్య, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్ గ్రామానికి చేరుకొని దేవన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం తెలిపారు. అదేవిధంగా అయిజ మున్సిపాలిటీలోని బస్టాండ్‌చౌరస్తాలో దేవన్న చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అయిజ మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, పీఏసీఎస్ చైర్మన్ పోతుల మధుసూదన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పటేల్ విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

4న మహార్యాలీకి తరలిరావాలి

గద్వాల అర్బన్: వీరశైవ లింగాయత్‌ల సామాజిక, ఆర్థిక డిమాండ్ల సాధన కోసం జూన్ 4న హైదరాబాద్‌లో నిర్వహించే మహార్యాలీని నిర్వహిస్తునట్లు వీరశైవ లింగాయత్‌ల ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి బీజాపూర్ ఆనంద్, వీఎల్‌పీ జిల్లా అధ్యక్షుడు గట్టు సురేష్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నుంచి కూడా వీరశైవులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 28న జిల్లాలోని ధరూరు, గట్టు, కేటీదొడ్డి మండలాల్లో నిర్వహించే పల్లెపల్లెకు సన్నాహక సమావేశాలకు రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు.

అంబలి కేంద్రాలతో బాటసారులకు ఉపశమనం



అమరచింత: మండు వేసవిలో బాటసారులకు, ప్రయాణికులకు అంబలి కేంద్రాలు ఉపశమనం కలిగిస్తున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీలన్‌గౌడ్ అన్నారు. పట్టణంలో శబరినాథ్‌గౌడ్, అక్షయ జ్ఞాపకార్థం అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఎం లో సుదూర ప్రాంతాల నుంచి తమ గమ్యస్థానాలకు వెళ్తున్న ప్రయాణికులు అంబలి కేంద్రాల్లో ఉచితంగా అందిస్తున్న అంబలిని తాగి ఉష్ణతాపం నుంచి తప్పించుకుంటున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం వేసవిలో చలివేంద్రంతో పాటు అంబలి కేంద్రం నిర్వహిస్తున్న కమలాకర్‌గౌడ్, పురోషోత్తంగౌడ్‌ను అభినందించారు. కార్యక్రమంలో తిరుమలేష్, వెంకటేష్, నామాల కృష్ణయ్య పాల్గొన్నారు.

విధిగా ఆధార్‌కార్డు అప్‌డేట్ చేసుకోండి



వీపనగండ్ల: ఉన్నతాధికారుల ఆదేశానుసారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌లో ప్రజలు తమ ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ కతలప్ప కోరారు. శుక్రవారం పుల్గర్‌చర్లలోని ఆధార్‌కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆధార్‌కార్డు అనుసంధానం చేసుకోవడం వల్ల బహుళ ప్రయోజనాలు పొందవచ్చని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారు అప్‌డేషన్ గడువు ముగిస్తే ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. ఆధార్ అప్‌డేషన్ కోసం వెళ్లే ప్రజలు రేషన్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్, ఓటర్‌కార్డులో ఏదైనా రెండింటిని అప్‌డేషన్ కేంద్రానికి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు ఆధార్ అప్‌డేషన్ ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా చూడాలని ఆయన కోరారు. పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎద్దుల సురేందర్ రెడ్డి, వీఆర్ఏ పరమేష్ పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు

- గద్వాల రహదారులపై గుంతలు
- వాహనదారులకు తప్పని అవస్థలు



గుంతలమయంగా గద్వాల -అయిజ రోడ్డు



గద్వాల-అయిజకు వెళ్లే రహదారిపై తేలిన కంకర

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి గద్వాలకు వచ్చే వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. రహదారులపై గుంతలు ఏర్పడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. జిల్లాలో అన్ని రోడ్లు అభివృద్ధి చేశామని చెప్తున్న ప్రజాప్రతినిధుల మాటలకు క్షేత్రస్థాయిలో ఉన్న రోడ్లకు పొంతన లేకుండా ఉన్నాయని పలువురు విమర్శలు వినిపిస్తున్నాయి.

వాహనదారులకు తప్పని తిప్పలు

జిల్లా కేంద్రంలో రోడ్లు గుంతలమయంగా మారాయి. ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. అయిజ వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి కొండపల్లి వరకు అడుగుకో గుంత దర్శనమిస్తోంది. రాత్రివేళ ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. తెలంగాణ చౌరస్తాలో (మేలచేర్వుకు వెళ్లే దారిలో) కంకర తేలడంతో వాహనాలు అదుపుతప్పి ప్రయాణికులకు గాయాలైన ఘటనలు ఉన్నాయి. కృష్ణవేణి చౌరస్తా, చేపల మార్కెట్ నుంచి రాంనగర్ వెళ్లే దారిలో, అదేవిధంగా అంబేద్కర్ చౌరస్తా నుంచి రెండో రైల్వేగేటు, పంచాయతీ రాజ్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట ఉన్న రోడ్డు ప్రయాణించేందుకు కూడా వీలులేకుండా పోయాయి. తప్పనిపరిస్థితిలో బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. చిన్నపాటి చినుకులకే గుంతలమయంగా ఉన్న రోడ్లపై నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని రోడ్ల పరిస్థితి ఇలా ఉంటే గ్రామాల్లోనే రోడ్లు ఎలా ఉంటాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

పట్టించుకోని అధికారులు

జిల్లా కేంద్రంలో గుంతలమయంగా ఉన్న రోడ్లకు సంబంధిత అధికారులు మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. అధికారులకు విన్నవించినా తూతూమంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. వాహనదారులు ప్రమాదాలబారిన పడినా చూసి చూడనట్టు వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఈ రహదారులపై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయాణిస్తున్నా పట్టించుకోకపోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లకు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తాం

జిల్లా కేంద్రంలో రహదారులపై గుంతలను పరిశీలిస్తాం. ఎక్కడైనా గుంతలు ఉంటే వెంటనే పూడ్చివేసేందుకు చర్యలు తీసుకుంటాం. గద్వాల -అయిజకు వెళ్లే రోడ్డుకు మరమ్మతుకు టెండర్లు పూర్తయ్యాయి. రెండు రోజుల్లో పనులను ప్రారంభిస్తాం. జిల్లా కేంద్రంలో అర్‌అండ్‌బీ పరిధిలోని రోడ్లకు వెంటనే మరమ్మతు చేపడతాం.

– రాజేశ్వరి, ఏఈ, ఆర్‌అండ్‌బీ

కొనసాగుతున్న కంటి పరీక్షలు



ఆలూరులో కంటి పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యాధికారులు



మద్దూరులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

గట్టు: మండలంలోని బల్గెర, ఆలూరు, బస్వాపురంలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాలు కొనసాగాయి. మూడు గ్రామాల్లో మొత్తం 411 మందికి కంటి పరీక్షలు, 24 మందికి కంటి అద్దాల పంపిణీ, 29 మందికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపించినట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సాయిచరణ్, తిమ్మప్ప, సమీరా కౌసర్, హెల్త్ సూపర్‌వైజర్లు స్వర్ణలత, బాలమ్మ, ఏఎన్‌ఎంలు కేజీయా, భారతి, ఆయా గ్రామాలకు చెందిన ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని మద్దూరులో శుక్రవారం సర్పంచ్ లక్ష్మీదేవి, డాక్టర్ యాకుబ్‌బాషా కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. అదేవిధంగా చెన్నిపాడులో కంటి పరీక్షలు నిర్వహించారు. మద్దూరులో 144 మందికి కంటి పరీక్షలు, 26 మందికి కంటి అద్దాలు, 27 మందికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపించారు. అదేవిధంగా చెన్నిపాడులో 172 మందికి కంటి పరీక్షలు, ఆరుగురికి కళ్ల అద్దాలు పంపిణీ, 8 మందికి కంటి అద్దాల కోసం రిఫర్ చేశారు. కార్యక్రమంలో చంద్రన్న, శ్రావణి, లక్ష్మీనారాయణ, శారద, చిట్టెమ్మ, ఆశలు పాల్గొన్నారు.

బీసీ ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ధరూరు: వాల్మీకి బోయల కోసం ప్రత్యేకంగా బీసీ ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని వాల్మీకి బోయలతో కలిసి ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న వాల్మీకి బోయలకు ఎలాంటి ప్రత్యేక వృత్తులు లేవని, ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి అర్హత కలిగిన 18 ఏళ్లు నిండిన వాల్మీకులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు గోవిందు ఆధ్వర్యంలో తహసీల్దార్ నరేష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మునెప్ప, జిల్లా నాయకులు రంగస్వామి, కార్యదర్శి రాము, శాంతన్న రామకృష్ణ, జగదీష్, కృష్ణ, విష్ణు, ఆశన్న, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తాం



చెన్నిపాడులో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమణరావు

మానవపాడు: పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామని ఎంపీడీఓ రమణరావు అన్నారు. శుక్రవారం మండలంలోని చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గ్రామాలలో ఆయన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మన-ఊరు మన-బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులు నాణ్యతగా చేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా హరిత హరం కింద నాటిన మొక్కలకు నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహారదీక్ష



మేడికొండ నిరాహార దీక్షలో కూర్చున్న గ్రామస్తులు

అలంపూర్: మేడికొండ గ్రామాన్ని మండలం చేయాలని సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహారదీక్ష శుక్రవారం 12వ రోజు కొనసాగింది. స్థానిక ప్రజలు, మహిళలు దీక్షలో పాల్గొన్నారు. మేడికొండ గ్రామాన్ని మండలంగా ప్రకటించడానికి అన్ని అర్హతలు ఉన్నాయని పేర్కొన్నారు. 15 గ్రామాలతో కలిపి కొత్త మండలం ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందిస్తున్న వైద్య సిబ్బంది

రాజోళి: పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటునట్లు మెడికల్ ఆఫీసర్ మధుబాబు అన్నారు. శిశు మరణాల రేటు తగ్గించేందుకు గ్రామాల్లో ఐడీసీఎఫ్ 2023 కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో వైద్య సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. పిల్లలను పరీక్షించి వారి తల్లిదండ్రులకు పలు సలహాలు, సూచనలు అందించారు. ఐదేళ్లలోపు పిల్లలకు నీళ్ల విరేచనాలు, జ్వరం తదితర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని కోరారు. ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారు, ఇటుక బట్టీల దగ్గర ఉండే పిల్లలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని, వైద్య సిబ్బందికి సూచించారు. శిశు మరణాలను తగ్గించేందుకు ఏఎన్ఎం కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు ఓ ఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జయప్రకాష్, రామకృష్ణ, హెలెన్, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం



మాట్లాడుతున్న జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్

శాంతినగర్: మండలంలోని బుడమొర్సులో బీజేపీ మండల కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు నరసింహ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్ హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పూర్తి కావొస్తున్న సందర్భంగా అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ఇంటింటికీ వివరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శక్తికేంద్ర ఇన్‌చార్జ్ ఎల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి బీకే శ్రీను, బూత్ అధ్యక్షుడు ఉప్పరి రవి, మద్దిలేటి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవి దుక్కులపై రైతులకు అవగాహన

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని చాగాపురం రైతు వేదికలో శుక్రవారం వ్యవసాయ విస్తరణ అధికారి భరత్‌సింహా ఆధ్వర్యంలో వేసవి దుక్కులపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు దుక్కులు, సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల కలిగే లాభాలు, నేలలో తేమశాతం, భూమిలో కర్బన శాతాన్ని పెంచడం, పంటలకు మేలు చేసే సూక్ష్మజీవుల పెరుగుదల, పశువుల, కంపోస్టు ఎరువుల వినియోగంతో వచ్చే అధిక దిగుబడులపై అవగాహన కల్పించారు. అదేవిధంగా, పంటలో స్థూల, సూక్ష్మ పోషకాల లోపాలను నివారించుట, భూసారాన్ని పెంచడం కోసం పచ్చిరొట్ట ఎరువులను సాగు చేసి కలియదున్నడం వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా విద్యుత్ తీగలు



చేతికందె ఎత్తులో విద్యుత్ తీగలు

రాజోళి: మండలంలోని పచ్చర్లలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. స్థానిక ఎల్లమ్మ గుడి ఆవరణలో చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయి. అమ్మవారి దర్శనానికి మంగళ, శుక్రవారాల్లో వందలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఎప్పుడు ప్రమాదం చోటుచేసుకుంటుందోనని భక్తులు భయాందోళనకు గురువుతున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని భక్తులు ప్రమాదాల బారిన పడకముందు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బీజేపీతోనే పేదల సంక్షేమం



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు శేఖర్

అలంపూర్: బీజేపీతోనే పేదల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని బీజేపీ అయిజ మండల అధ్యక్షుడు శేఖర్ అన్నారు. శుక్రవారం అయిజ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తి కావొస్తున్న సందర్భంగా ఈ నెల 30వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా మండల, శక్తి కేంద్రాలు, పోలింగ్ బూత్ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు వివరించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ వెనకబడిన వర్గాల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ప్రధాని అంకితభావంతో పనిచేయడంతో ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూస్తున్నాయన్నారు. తొమ్మిదేళ్లలో కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోపాలకృష్ణ, ఆంజనేయులు, గిడ్డన్న, భీమన్న, వెంకటేష్, తిరుమలేష్ తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రైతుబీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గట్టు మండలం మాచర్ల గ్రామానికి చెందిన రైతు ప్రభాకర్ అనారోగ్యంతో మృతి చెందడంతో రైతు బీమా నుంచి రూ.5 లక్షలు మంజూరయ్యాయి. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రభాకర్ భార్య సునీతకు రైతు బీమా చెక్కు ఎమ్మెల్యే అందజేశారు. గద్వాలకు చెందిన మోదిన్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సీఎంఆర్‌ఎఫ్ నుంచి వైద్యం నిమిత్తం మంజూరైన రూ.2.50 లక్షల ఎల్‌వోసీని బాధితుడికి ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్, నాయకులు గోవిందు, అలీ, సురేష్, నర్సింహులు వెంకటన్న, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ



మల్దకల్‌లో క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దామ నాగరాజు

మల్దకల్: మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో శుక్రవారం ఫుట్‌బాల్ క్రీడాకారులకు దాత మాజీ సర్పంచ్ దామ నాగరాజు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంచుకున్న క్రీడలో రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని ఆయన కోరారు. క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం 50 మంది క్రీడాకారులకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో పీడీ జితేందర్, రాజు, తిరుమల్, వెంకటేష్ పాల్గొన్నారు.

పల్లెల ప్రగతికి ప్రభుత్వం కృషి



ఇటిక్యాలలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెల్లో ప్రగతికి ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తుందని అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. శుక్రవారం ఇటిక్యాల మండలంలోని వల్లూరు నుంచి కోయిల్‌దిన్నె వరకు రూ. కోటి 70 లక్షల వ్యయంతో చేపట్టనున్న మూడు కిలో మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కూడా ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి గ్రామానికి కూడా రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గిడ్డారెడ్డి, సర్పంచ్ ఏసన్న, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, తదితరులు ఉన్నారు.

దళిత ఎంపీటీసీకి అవమానం..

బీటీ రోడ్డు నిర్మాణం పనుల భూమి పూజ కార్యక్రమానికి స్థానిక ఎంపీటీసీకి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అవమానించారని సోషల్ మీడియాలో పోస్టులు చక్కర్లు కొట్టాయి. పార్టీ టికెట్‌తో గెలిచిన ఎంపీటీసీ సువార్తమ్మ దళిత మహిళ కావడంతోనే ప్రతి సారి ఎమ్మెల్యే, అధికారులు తనను అవమానిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఎమ్మెల్యే తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

మెగా రక్తదాన శిబిరం ఏర్పాట్లు పరిశీలన

అలంపూర్: అయిజ మండలం సంకాపురంలో మెగా రక్తదాన ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం శుక్రవారం పరిశీలించారు. ఉత్తనూరు తిరుమల్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఈ నెల 28వ తేదీన గ్రామంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ రాముడు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులతో పలు అంశాలపై చర్చించారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. వీరితోపాటు నాయకులు అజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఖోఖో పోటీలకు కేజీబీవీ విద్యార్థిని ఎంపిక

కేటీదొడ్డి: సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో కేటీదొడ్డి కేజీబీవీ విద్యార్థిని శ్వేత ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు కేజీబీవీ ఎస్‌ఓ పద్మావతి, పీఈటీ అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పశు సంపదను కాపాడుకుందాం



గేదెకు టీకా వేస్తున్న ఎల్ఎస్ఏ లతీఫ్

శాంతినగర్: పశు సంపదను కాపాడుకుందామని పశువైద్యశాల డాక్టర్ పుష్పలత అన్నారు. శుక్రవారం వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వడ్డేపల్లి, శాంతినగర్‌లోని పశువులకు గొంతువాపు, జబ్బువాపు టీకాలు వేశారు. శాంతినగర్ పశువైద్యశాల డాక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో 175 గేదెలు, 42 ఆవులు, ఎద్దులకు టీకాలు వేశారు. పశు కాపరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ లతీఫ్, వీఏ ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించే వెంచర్లపై చర్యలు

అమరచింత: పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా వెంచర్లను ఏర్పాటు చేస్తూ.. ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టే వారిపై చర్యలు తప్పవని, అలాంటి వెంచర్లకు అనుమతులను నిలిపివేస్తామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా తెలిపారు. బీసీ కాలనీలో సర్వే నంబర్ 647లో సుమారు ఆరు ఎకరాల వ్యవసాయ భూమిలో ఇటీవల నాలా పర్మిషన్ తీసుకొని, వెంచర్ ఏర్పాటు చేయడానికి డీటీపీసీ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కేవీఆర్ వెంచర్‌గా నామకరణం చేసిన నిర్వాహకులు ఎత్తిపోతల కాల్వ, భీమా కాల్వలు వెంచర్ సమీపంలో వెళ్తున్నాయని, దీనికి ఇరిగేషన్ శాఖ అధికారుల సూచనల మేరకు స్థలాన్ని వదలకుండా వాటిలోనే మున్సిపాలిటీకి 10శాతం స్థలాన్ని కేటాయించారన్న ఫిర్యాదు మేరకు శుక్రవారం కమిషనర్ వెంచర్‌ను ఆకస్మికంగా పరిశీలించారు. కెనాల్‌కు 17 మీటర్ల దూరంలో వెంచర్ ఉండాలని, వాటిని అతిక్రమించినట్లు గుర్తించామన్నారు. వీటికోసం టౌన్ ప్లానింగ్ అధికారికి ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. నీటిపారుదల కాల్వలు, చెరువులు ఉన్న చోట బఫర్ జోన్‌గా గుర్తించి భవిష్యత్‌లో వెంచర్‌లోని ఇంటి స్థలాలకు సీ పేజ్ రాకుండా ఉండేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు చూపిన విధంగా స్థలాలను వదలాలని ఆయన అన్నారు.

తొలగించని 11కేవీ లైన్

కేవీఆర్ వెంచర్‌లో ఇప్పటి వరకు అన్ని పనులు పూర్తయ్యాయని, అనుమతులు ఇవ్వాలని దరఖాస్తు పెట్టుకున్న సదరు యాజమాని ఇప్పటి వరకు 11 కేవీ విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించలేదు. అప్పటివరకు అనుమతి ఇవ్వమని అధికారులు పేర్కొన్నారు.